క్లుప్తంగా

ఎల్లమ్మ ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న చింతా ప్రభాకర్, నాయకులు

కంది(సంగారెడ్డి): మండల పరిధిలోని రేణుకా ఎల్లమ్మ మహోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా భక్తులు బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉపసర్పంచ్ నరేష్‌గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరిరెడ్డి, సీడీసీ చైర్మన్ బుచ్చిరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి నాయకులు వీజేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'మన ఊరు-మన బడి'పై అవగాహన సదస్సు

కొండాపూర్(సంగారెడ్డి): మన ఊరు-మన బడి పనుల విషయంలో అధికారులు పర్యవేక్షిస్తూ పనులు సకాలంలో పూర్తయ్యే విధంగా చూడాలని, ఎప్పటికప్పుడు పనులను మొబైల్ యాప్‌లో నమోదు చేయాలని డీఈఓ వెంకటేశ్వర్లు అన్నారు. మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎంఈఓలు, ఎఫ్ఎల్ఎన్ నోడల్ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఎంఐఎస్ కోఆర్డినేటర్‌లకు, సీఆర్పీలకు అవగాహన సదస్సు నిర్వహించారు.

రంగనాథస్వామికి బాబుమోహన్ పూజలు

జోగిపేట(అందోల్): భవాని సమేత రంగనాథ స్వామి దేవాలయ వార్షికోత్సవంలో మంగళవారం మాజీ మంత్రి బాబుమోహన్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ పూజారి శాంనాథ్‌శర్మ సన్మానించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామచంద్రాపురం (పటాన్ చెరు): పట్టణంలో మంగళవారం సాయంత్రం ఈదురు గాలితో కూడిన వర్షం పడడంతో పలుచోట్ల చెట్లు విరిగి రోడ్లపై పడ్డాయి. పలుచోట్ల విద్యుత్ తీగలపై చెట్లు పడడంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సాయంత్రం నుంచి రాత్రి వరకు విద్యుత్ సరఫరా లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

జాతీయ బీసీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన కార్మికులు

రామచంద్రాపురం (పటాన్ చెరు): జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హంసరాజ్ గంగారంను బెల్ కార్మికులు జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్‌తో కలిసి హైదరాబాద్‌లో కలిశారు. బీఎంఎస్ నాయకులు బెల్ కాలనీలో జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాల ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించేవిధంగా యాజమాన్యంతో మాట్లాడాలని కోరగాఅందుకు సానుకూలంగా స్పందించారని తెలిపారు.

డీఎంఎస్ నిధులను కేటాయించాలి

జిన్నారం(పటాన్‌చెరు): కంకర క్రషర్‌ల ద్వారా రానున్న డీఎంఎస్ నిధులను ప్రభావిత గ్రామాలకు అధికంగా కేటాయించాలని ఖాజీపల్లి ఎంపీటీసీ భార్గవ్ డిమాండ్ చేశారు. డీఎంఎస్ నిధులను ఖాజీపల్లి, మాదారం గ్రామాలకు కేటాయించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఖాజీపల్లిలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా భార్గవ్ మాట్లాడుతూ మాదారం, ఖాజీపల్లి గ్రామాల్లో కంకర క్రషర్‌లు అధికంగా ఉండటంతో ప్రజలకు ఎక్కువగా నష్టం జరుగుతోందన్నారు. దీంతో మంజూరవుతున్న డీఎంఎస్ నిధులను సంబంధిత గ్రామాల అభివృద్ధికి అధికంగా కేటాయించాలని డిమాండ్ చేశారు.

లా సబ్జెక్టు గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తుల ఆహ్వానం

కొండాపూర్(సంగారెడ్డి): తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ న్యాయ కళాశాలలో లా సబ్జెక్టు బోధించుటకు గెస్ట్ ఫ్యాకల్టీ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ క్రిష్టా నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యాయశాస్త్రంలో పీజీ, సెట్, నెట్, పీహెచ్‌డీ విద్యార్హతలు కలిగి ఉన్న అభ్యర్థులు అర్హులన్నారు. అభ్యర్థులు గూగుల్ ఫారంలో దరఖాస్తును నింపి, రూ.300 డిమాండ్ డ్రాఫ్ట్‌ను జత చేసి బయోడేటాను ఈనెల 16 లోగా సెక్రెటరీ, టీటీడబ్ల్యూఆర్ఈఐఎస్ డీఎస్ఎస్ భవన్, మాసాబ్ ట్యాంక్, హైదరాబాద్- 500034 చిరునామాకు పంపాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు పూర్తి వివరాల కోసం www.ttwrdcr.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

నేడు ప్రవేశ పరీక్ష

కొండాపూర్(సంగారెడ్డి): మహాత్మజ్యోతి బాపూలే గురుకుల పాఠశాలలో 6, 7, 8వ తరగతుల్లో బ్యాక్‌లాగ్ సీట్లను భర్తీ చేసేందుకు బుధవారం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ఆర్‌సీఓ ప్రభాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ఉంటుందన్నారు. 6వ తరగతి ప్రవేశాలకు 1078, ఏడవ తరగతికి 841, 8వ తరగతికి 685 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు.

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



నారాయణఖేడ్ : అభిషేక్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

జోగిపేట(అందోల్): ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు మెరుగైన ఫలితాలు సాధించాయి. ప్రభుత్వ కళాశాలలో మొదటి సంవత్సరంలో 28శాతం ద్వితీయ సంవత్సరంలో 51శాతం విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ రజిత తెలిపారు. ఇంటర్మీడియట్ ఫలితాల్లో జోగిపేటలోని ఎస్ఆర్ఎం కళాశాల విజయ డంకా మోగించింది. సీఈసీ గ్రూపులో సౌజన్య 453 మార్కులతో డివిజన్ స్థాయిలో ర్యాంకు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి, కరస్పాండెంట్ చంద్రశేఖర్ తెలిపారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో మానస 446 మార్కులు, బైపీసీలో సునంద 427మార్కులు సాధించినట్లు తెలిపారు. ద్వితీయ సంవత్సరంలో సీఈసీలో నిమిత 972 ఎంపీసీలో పూజ 961మార్కులు, బైపీసీలో శ్రావణి 953 మార్కులు సాధించారు. అదేవిధంగా ప్రశాంత్ ఒకేషనల్ కళాశాలకు చెందిన భానుప్రియ ఎంఎల్టీ గ్రూపులో 464 మార్కులు సాధించింది. ఎంఆర్‌హెచ్ డబ్ల్యు(ఎఫ్) గ్రూపులో నికిత 459 మార్కులు సాధించింది. ద్వితీయ సంవత్సరం ఎంఎల్టీ గ్రూపులో కృష్ణవేణి 962 మార్కులు సాధించగా ఎంపీహెచ్ డబ్ల్యూ (ఎఫ్) గ్రూపులో సౌమ్య 960మార్కులు సాధించింది.

జిన్నారం(పటాన్‌చెరు): ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాల్లో ప్రభుత్వ కళాశాల్లో చదువుతున్న విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. బొల్లారం మున్సిపల్ పరిధిలోని తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించారు. ఇంటర్ సెకండ్ ఇయర్‌లో కావ్యశ్రీ (ఎంఈసీ)972, షణ్ముఖరావు (సీఈసీ)978, రేణుశ్రీ(బైపీసీ)976, భార్గవి(ఎంపీసీ)975 మార్కులు సాధించారు.

న్యాల్‌కల్(జహీరాబాద్): ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో మండలంలోని ప్రభుత్వ కళాశాలలు 81 శాతం ఉత్తీర్ణత సాధించాయి. న్యాల్‌కల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల(సెకండియర్) 85.71శాతం ఉత్తీర్ణత సాధించగా, హద్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల 76శాతం ఉత్తీర్ణత సాధించింది.

పటాన్‌చెరు: డివిజన్ పరిధిలోని మంజీరా జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చాటారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీ విద్యార్థినులు సింధు 961, వైష్ణవి 935 బైపీసీ విద్యార్థిని సరిత 940 అనిల్ 916 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ విద్యార్థులు శశాంక్ 461 అభిషేక్ 460, పాండురంగా 458, సాయిచందర్ 457 సాయిసూరజ్ 456 మార్కులు సాధించి కళాశాల టాపర్లుగా నిల్చారని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చాటారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని వర్షిత ఎంపీసీ 975, అశ్విని 960 మార్కులు, రేష్మ 953 మార్కులు సాధించి కళాశాల టాపర్లుగా నిల్చారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ విద్యార్థి షాహిద్ 448 సాధించి కళాశాల మొదటి స్థానంలో నిల్చాడని ప్రిన్సిపాల్ మురళి తెలిపారు.

జహీరాబాద్ టౌన్: రంజోల్ సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాల ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థి శ్రీజ 984 (ఎంపీసీ) మార్కులతో టాపర్‌గా నిలిచింది. అదే కళాశాలకు చెందిన గ్రేసీకి 956, జ్యోతికి 918, బైపీసీలో శోభనకు 979, జాన్సీకి 975, మమతకు 977, వర్షితకు 976, ఆశాకు 957 మార్కులు వచ్చాయని ప్రిన్సిపాల్ కృష్ణవేణి తెలిపారు. ఇంటర్ ఫస్ట్‌ఇయర్ విద్యార్థి ప్రియాంక 460(ఎంపీసీ) మార్కులతో టాపర్‌గా నిలువగా మానికకు 458, భానుప్రియకు(బైపీసీ) 456, శిరీషకు 436, పింకికి 430, మమతకు 425, ఎంఎల్‌టీ ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో ఈశ్వరికి 486, అనితకు 483 మార్కులు వచ్చాయి. అల్గోల్ మైనార్టీ బాలుర జూనియర్ కళాశాలలో విద్యార్థులు సత్తా చాటారు. సెకండ్ ఇయర్ అనిల్(బైపీసీ)427, కిశోర్‌కు (ఎంపీసీ) 462, అలావుద్దీన్‌కు 462 మార్కులు వచ్చాయి. పట్టణంలోని శ్రీగాయత్రి జూనియర్ కళాశాల విద్యార్థిని సాయివాణి(ఎంపీసీ) 466 మార్కులు, వైష్ణవి 464 మార్కులతో స్టేట్ ర్యాంక్ సాధించారు. బైపీసీ ఫస్ట్ ఇయర్‌లో శ్వేతకు 434(బైపీసీ), ఖైపకు 434 మార్కులతో స్టేట్ టాపర్‌గా నిలిచారు. ఎంపీసీ సెకండ్ ఇయర్‌లో సోమశేఖర్, కావ్యశ్రీలకు 986 మార్కులు, బైపీసీలో మానికకు 990, సింధుకు 990 మార్కులు వచ్చాయని ప్రిన్సిపాల్ తెలిపారు.

నారాయణఖేడ్: ఇంటర్మీడియట్ ఫలితాల్లో నారాయణఖేడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ఇంటర్ సెకండియర్ బైపీసీలో మహాశెట్టి నందిని 981 మార్కులు, ఎంపీసీలో సింధు 981 సాధించారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో విష్ణుగౌడ్ 459 సాధించగా బైపీసీలో పూజ 426 హెచ్ఈసీలో సజుబేదా అంజుమ్ 435 సాధించారు. సత్తెగామ గ్రామానికి చెందిన అభిషేక్ ఇంటర్ ఎంపీసీ ప్రథమ సంవత్సరంలో 467 మార్కులు సాధించడంతో ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి గ్రామానికి వెళ్లిన సందర్భంగా అభిషేక్‌ను అభినందించి స్వీట్ తినిపించారు. సాహితీ కళాశాలకు చెందిన ముస్కాన్ ఫాతిమా బైపీసీ మొదటి సంవత్సరంలో 427 మార్కులు సాధించి రాష్ట్రంలో 9వ ర్యాంకు దక్కించుకుంది. అదేవిధంగా వాగ్దేవి కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటారు.

మునిపల్లి(అందోల్): ఇంటర్మీడియట్ ఫలితాలు మంగళవారం వెలువడ్డాయి. మండలంలో ఫస్టియర్ 346 మంది, సెకండియర్‌లో 299 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు ప్రిన్సిపాల్స్ భాస్కర్‌రెడ్డి, హిమాబిందు తెలిపారు. ఇంటర్మీడియట్ సెకండియర్ బైపీసీలో శృతి 957 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. ఎంపీసీ సెకండియర్‌లో నిఖిత 947 మార్కులు సాధించి రెండవ స్థానంలో నిలవగా ఐశ్వర్య సీఈసీ 818 మార్కులు సాధించి మూడవ స్థానంలో నిలిచింది. ఫస్టియర్ సీఈసీలో మనిషా 451, హుమా ఎంపీసీ 425 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ హిమాబిందు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

రామచంద్రాపురం (పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని శ్రీగీతా భూపాల్‌రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల సీఈసీ గ్రూపునకు చెందిన విద్యార్థిని షరీన్ ఫాతిమా 972 మార్కులు సాధించి సీఈసీ గ్రూపులో రాష్ట్ర రెండో ర్యాంకు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఉమామహేశ్వర్ తెలిపారు. ఈ కళాశాలలో ఉత్తమ ఫలితాలు రావడంతో మాజీ ఎమ్మెల్సీ భూపాల్‌రెడ్డి అధ్యాపకులను అభినందించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని అండూర్, సోలక్‌పల్లి, మంగంపేట, జిన్నారం, జంగంపేట, వావిలాల, ఖాజీపల్లి, నల్తూర్, కొడకంచి, మాదారం గ్రామాల్లో రూ.2.5కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు మంగళవారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేస్తూ ముందుకు సాగుతున్నామని వివరించారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, ఎంపీపీ రవీందర్‌గౌడ్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

వికలాంగుడికి అభయం

జిన్నారం గ్రామానికి చెందిన హన్మంత్‌చారికి అనారోగ్యంతో వైద్యులు కుడికాలును తొలగించారు. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి స్పందించి హన్మంత్‌చారిని పరామర్శించారు. హన్మంత్‌చారికి జైపూర్ కాలును పెట్టించేవిధంగా చర్యలు తీసుకుంటానని, స్కూటీని ఇప్పిస్తానని భరోసా ఇచ్చారు.

ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌ల వాడకం ప్రమాదకరం

జహీరాబాద్ టౌన్: ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌ల వాడకం ప్రమాదకరమని ఆర్డీఓ రమేష్‌బాబు అన్నారు. గ్రామిక విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మహిళలు కుట్టిన క్లాత్ బ్యాగ్‌లను ఆర్డీఓ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాత్కాలిక వెసులుబాటు కోసం క్యారీ బ్యాగ్స్ వాడటం ద్వారా తాగేనీరు, తినే తిండి, భూమి కలుషితమై మానవ మనుగడ ప్రశ్నార్థకమయ్యే ప్రమాదం ఉందన్నారు. ప్రతిఒక్కరూ క్లాత్ బ్యాగ్‌లను ఉపయోగించాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ మల్లారెడ్డి మాట్లాడుతూ క్యారీ బ్యాగ్‌ల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు గ్రామిక్ విజ్ఞాన కేంద్రం ట్రస్టీ డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ మానవ మనుగడకు మేలు చేసే క్లాత్ బ్యాగ్‌లను ప్రతిఒక్కరూ ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో నిర్వాహకులు డాక్టర్ శివబాబు, రాంచందర్, మహిపాల్ పాల్గొన్నారు.



క్లాత్ బ్యాగ్‌లను ఆవిష్కరిస్తున్న ఆర్డీఓ

నిరుద్యోగ మార్చ్‌కు తరలిరావాలి

జహీరాబాద్ టౌన్: ఈ నెల 11న సంగారెడ్డిలో నిర్వహించతలపెట్టిన బీజేపీ నిరుద్యోగ మార్చ్‌కు నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో తరలిరావాలని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వీరేందర్‌గౌడ్ పిలుపునిచ్చారు. నిరుద్యోగ మార్చ్ నిర్వహించనున్న సందర్భంగా మంగళవారం జహీరాబాద్‌లో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరేందర్‌గౌడ్ మాట్లాడుతూ టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.

నిరుద్యోగ మార్చ్‌ను జయప్రదం చేయాలి

నారాయణఖేడ్: ఈనెల 11న నిర్వహించనున్న నిరుద్యోగ మార్చ్‌ను జయప్రదం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు నరేందర్‌రెడ్డి తెలిపారు. నిరుద్యోగ మార్చ్‌పై నారాయణఖేడ్‌లో మంగళవారం సమావేశం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జన్‌వాడే సంగప్ప, వీరేందర్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ రజినీకాంత్, మారుతిరెడ్డి, పత్తిరి రామకృష్ణ, సాయిరాం పాల్గొన్నారు. అనంతరం ఖేడ్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట చేపట్టిన జేపీఎస్‌ల సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

నారాయణఖేడ్: మండలంలోని మాణిక్‌నాయక్ తండా, నమ్లిమేట్, పోతన్‌పల్లి (ఎం), హన్మంత్‌రావుపేట్, లింగాపూర్, జూకల్ గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను జెడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్‌నాయక్, ఎంపీపీ కర్ర చాందీబాయి చౌహాన్, మండల రైబస అధ్యక్షులు సత్యపాల్‌రెడ్డి సంబంధిత సర్పంచ్‌లతో కలిసి ప్రారంభించారు. నాయకులు పరమేశ్వర్, రమేష్ చౌహాన్, రాజునాయక్, ప్రభాకర్ పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ

రేపు ఆత్మీయ సమ్మేళనం

రాయికోడ్(అందోల్): రాయికోడ్‌లో ఈ నెల 11న ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ మల్లికార్జున్ పాటిల్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు బసవరాజ్ పాటిల్, శంకర్ అన్నారు. మంగళవారం హుల్గేర, శంశోద్దీన్ పూర్, మాటూర్, ఇటికేపల్లి, నాగ్వార్ తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ విఠల్, వరము ఉపాధ్యక్షుడు తుకారామ్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ

నారాయణఖేడ్: ఖేడ్‌లోని అంబేడ్కర్ భవన్‌లో మంగళవారం ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల సంఘం డైరీని సంఘ రాష్ట్ర కార్యదర్శి సంతోష్ కుమార్, జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సంస్థ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అబ్దుల్ రహీం, పండరిలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పరిరక్షణ సంస్థ రాష్ట్ర కమిటీకి డైరీని బహూకరించారు. అంబేడ్కర్ సంఘం నాయకులు నారాయణ, రాములు, సిద్ధు, నగేష్ పాల్గొన్నారు.



నారాయణఖేడ్: డైరీ ఆవిష్కరిస్తున్న నాయకులు

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ మీనాక్షి సాయికుమార్

మునిపల్లి(అందోల్): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జెడ్పీటీసీ మీనాక్షి సాయికుమార్ అన్నారు. మంగళవారం నిర్వహించిన బుదేరా ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా నేడు ప్రభుత్వ పాఠశాలలు రూపుదిద్దుకుంటున్నాయని తెలిపారు. అనంతరం జెడ్పీటీసీని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆరిఫా, లెక్చరర్లు పాల్గొన్నారు.

హద్నూర్‌లో కంటి వెలుగు శిబిరం

న్యాల్‌కల్(జహీరాబాద్): కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని హద్నూర్ సర్పంచ్ మాతం శెట్టి వీరమణి, బీఆర్‌ఎస్ నాయకుడు రాజ్‌కుమార్ అన్నారు. మంగళవారం హద్నూర్ గ్రామంలో కంటివెలుగు శిబిరాన్ని సర్పంచ్ ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న జేపీఎస్‌ల సమ్మె

నారాయణఖేడ్: ఆర్డీఓ కార్యాలయం ఎదుట జేపీఎస్‌లు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. మంగళవారం సాయంత్రం 5గంటలలోపు విధుల్లో చేరకుంటే ఉద్యోగాలనుంచి తొలగిస్తామని ప్రభుత్వం స్పష్టం చేసిన నేపథ్యంలో నారాయణఖేడ్ ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, డీఎల్పీఓతో కలిసి సమ్మె శిబిరానికి టెర్మినేషన్ నోటీసులను తీసుకువచ్చారు. అధికారులు నచ్చచెప్పినా నోటీసులను తీసుకొనేందుకు జేపీఎస్‌లు నిరాకరించడంతో అధికారులు వెనుదిరిగారు.

సంగారెడ్డి టౌన్ : జూనియర్ పంచాయతీ సెక్రెటరీలను రెగ్యులరైజ్ చేయాలని చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. ఈ సందర్భంగా టీపీటీయఫ్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు నాగారం శ్రీనివాస్ సమ్మెకు మద్దతు ఇచ్చారు. కార్యక్రమంలో పాండురంగారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు, రమేష్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జేపీఎస్‌ల సమ్మెకు సంఘీభావం

జహీరాబాద్ టౌన్: ఎంపీడీఓ కార్యాలయం ఎదుట జహీరాబాద్, మొగుడంపల్లి, న్యాల్‌కల్, ఝరాసంఘం, కోహీర్ మండలాల జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మెకు మొగుడంపల్లి మండల కాంగ్రెస్ నాయకులు మక్సూద్, అర్షద్ పటేల్, టీపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు సంఘీభావం తెలిపారు. అనంతరం వంటావార్పుకు రూ.5 వేల నగదు అందజేశారు.

ఆర్థికసాయం అందజేత

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండలంలోని మన్నాపూర్ గ్రామ సర్పంచ్ హైదరాబాద్ ఈశ్వర్‌రెడ్డి గ్రామానికి చెందిన చిరాగ్‌పల్లి బక్కారెడ్డి, కామనెల్లి సంగ్రాంల కూతుళ్ల వివాహాలకు హాజరై ఒక్కొక్కరికి రూ.5011 చొప్పున చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఈశ్వర్‌రెడ్డికి సంబంధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

ధరణిలో రైతుల వివరాలు నమోదు చేయాలి



వినతిపత్రంఅందజేస్తున్న నేతలు

కొండాపూర్(సంగారెడ్డి): ధరణిలో రైతుల పేర్లు నమోదు చేసి కొత్త పట్టాదార్ పాస్‌పుస్తకాలు ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఏఓ మహిపాల్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ కొండాపూర్ మండలం మహ్మదాపూర్‌లో సర్వేనంబరు 22లో 188 మందికి 32 ఎకరాలకు సంబంధించిన అప్పటి ప్రధాన మంత్రి మన్మోహన్‌సింగ్ చేతుల మీదుగా పట్టాలు, పాసుబుక్‌లు ఇచ్చారన్నారు. కానీ ప్రస్తుతం పేర్లు తొలగించి ధరణిలో లేకుండా చేశారన్నారు. 12 సంవత్సరాల నుంచి భూములను సాగు చేస్తున్నా, రైతుబంధు, రైతు బీమా, ఇతర ప్రభుత్వ సబ్సిడీలు రైతులకు లేకుండా పోయాయన్నారు. కాస్తులో ఉన్న వారి వివరాలు పరిశీలించి ధరణిలో రైతుల పేర్లు నమోదు చేసి, కొత్త పాస్ పుస్తకాలు ఇవ్వాలన్నారు. లేకపోతే రైతులకు మద్దతుగా జిల్లావ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు యాదవరెడ్డి, మండలకార్యదర్శి రాజయ్య పాల్గొన్నారు

సంక్షిప్త వార్తలు

◆ **అతిథి అధ్యాపకుల దరఖాస్తులకు ఆహ్వానం**

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండలంలోని పెద్దకంజర్ల గ్రామ సమీపంలోని గిరిజన గురుకుల డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకం చేపట్టనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులలో పీజీ, పీహెచ్‌డీ, నెట్ అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 16వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఖాళీల వివరాలు.. కామర్స్-1, గణితం-1, కంప్యూటర్ సైన్స్-2, ఇంగ్లీష్-1, జూలజీ-1, ఫిజికల్ డైరెక్టర్-1లకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

◆ **విరాళం అందజేత**

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని బొంతపల్లి గ్రామంలో నేడు నిర్వహించనున్న నల్లపోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలకు రూ.50వేలు , నల్లవల్లి గ్రామంలో నిర్వహించనున్న బీరప్ప కల్యాణ మహోత్సవానికి రూ.1.16లక్షల విరాళాన్ని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ మంగళవారం అందజేశారు.

◆ **వాల్‌పోస్టర్ ఆవిష్కరణ**

న్యాల్‌కల్(జహీరాబాద్): జూన్ 4వ తేదీన వీరశైవ లింగాయత్ సమాజ్ నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను మంగళవారం ఆ సంఘం నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం యూత్ సభ్యులు ఆనందేశ్వర్, సంగమేశ్, సురేష్, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

రాయికోడ్(అందోల్): వీరశైవ లింగాయత్‌లను ఓబీసీ జాబితాలో చేర్చాలనే డిమాండ్‌తో వచ్చే నెల 4న హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న సందర్భంగా మంగళవారం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీరశైవ లింగాయత్ మండల నాయకులు శ్రీనివాస్, పవన్‌కుమార్ మాట్లాడుతూ బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సంఘం నాయకులు సంతోష్ పాటిల్, ప్రవీణ్‌కుమార్ పాటిల్, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

◆ **తెల్లాపూర్ మున్సిపాలిటీ సందర్శన**

రామచంద్రాపురం (పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ కార్యాలయాన్ని మంగళవారం రాష్ట్ర రేడ్కో చైర్మన్ సతీష్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ ఆయనకు స్వాగతం పలికారు.

◆ **విరాళం అందజేత**

జోగిపేట(అందోల్): జోగిపేటలో మల్లికార్జున ఆలయ పునః నిర్మాణానికి సీఎస్ఆర్ ఫౌండేషన్ ద్వారా రూ.50వేల విరాళాన్ని మంగళవారం అందజేసినట్లు జెడ్పీటీసీ మీనాక్షి సాయికుమార్ తెలిపారు. కురుమ సంఘం జిల్లా నాయకులు భూమయ్య, మల్లేశం, ఊస శివశంకర్, ఊస జోగినాథ్, మాసగోని శ్రీశైలం పాల్గొన్నారు.

◆ **రేపు హజ్ యాత్రికులకు శిక్షణ**

జహీరాబాద్: హజ్ యాత్రకు వెళ్లే యాత్రికులకు ఈనెల 11వ తేదీన శిక్షణ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జహీరాబాద్ పట్టణంలో సైఫ్ సాహెబ్, ఖతీబ్ షిరీన్ ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నట్లు డీఆర్‌యూసీసీ సభ్యుడు షేక్ ఫరీద్ తెలిపారు. ఈ సందర్భంగా మహిళలకు పరదా నోట్, పాల్గొనే వారికి భోజన వసతి ఏర్పాటు చేస్తామన్నారు.

◆ **సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ**

నారాయణఖేడ్: నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి, కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌లకు సంబంధించిన చెక్కులను మంగళవారం నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు.

◆ **జాబ్‌మేళాలో 33 మంది ఎంపిక**

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని ఆచార్య డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్ మేళాలో అర్హులైన అభ్యర్థులకు మౌఖిక పరీక్ష నిర్వహించి ఓ కంపెనీలో 15 మంది మరో కంపెనీలో 18 మంది ఎంపిక చేశారని ప్రిన్సిపాల్ డాక్టర్ హరికుమార్ తెలిపారు. వీరిలో డిగ్రీ పూర్తయిన అభ్యర్థులకు అపాయింట్మెంట్ ఆర్డర్‌ను మెడికల్ టెస్ట్ తర్వాత ఇస్తామని, ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులకు డిగ్రీ పూర్తయిన తరువాత అపాయింట్మెంట్ ఆర్డర్ అందచేస్తామని హెచ్ఆర్ ప్రతినిధులు తెలిపారు.

◆ **జోగిపేటలో హనుమాన్ చాలీసా పారాయణం**

జోగిపేట(అందోల్): కర్ణాటక రాష్ట్రంలో భజరంగ్‌దళ్‌ను నిషేధించేందుకు కుట్రలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ మంగళవారం జోగిపేటలోని పబ్బతి హనుమాన్ మందిరంలో హనుమాన్ చాలీసా పారాయణంను పఠించారు. వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు జూకంటి లక్ష్మన్ భజరంగదళ్ నాయకులు పాల్గొన్నారు.

◆ **సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి**

మునిపల్లి(అందోల్): ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అంతారం సర్పంచ్ శంకర్ అన్నారు. మంగళవారం మండలంలోని అంతారంలో సాంస్కృతిక కళాజాత బృందం కళాకారులు సంక్షేమ పథకాలపై పాటల రూపంలో వివరించారు.